Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL:2024/86143



WANTED

స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

చిత్తూరు ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు, జిల్లా కేంద్రాలలో స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి సెల్ : 9440815774



Associate Editor : K L Krishnam Raju | Volume : 6 | issue: 140 | Thusday : 08.05.2025 | Price : 3/- | Pages : 4

అసోషియేట్ ఎడిటర్ : కే ఎల్ కృష్ణం రాజు | సంపుటి : 6 | సంచిక :140 | గురువారం : 08.05.2025 | వెల : 3 | పేజీలు : 4


OPERATION SINDOOR


# ఆపరేషన్ సిందూర్

- 25 నిమిషాల్లోనే ఉగ్రమూకల ఖేల్ ఖతం
- 25 నిమిషాల్లోనే 9 పాక్ ఉగ్ర స్థావరాల విధ్వంసం
- భారత ఆర్మీ ఆపరేషన్ సిందూర్ విజయవంతం
- 24 మిస్సైల్స్, ఉపగ్రహ గైడెడ్ గైడ్ బాంబులతో తడాఖా



## భారత్ మెరుపుదాడిలో 70 మంది ఉగ్రవాదుల హతం..?

పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారంతో రగిలిపోయిన భారత్?- 25 నిమిషాల్లో 24 క్షిపణులతో దాడులు చేసి ఉగ్రవాద మూకల ఆటకట్టించింది. చెప్పినట్టే చేసి టెర్రరిస్టులకే టెర్రర్ అంటే ఏంటో చూపించింది. బుధవారం తెల్లవారుజామున 1:05 గంటల నుంచి 1:30 గంటల వరకు 25 నిమిషాల పాటు ఆపరేషన్ జరగ్గా, 9 ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడానికి 24 క్షిపణులను భారత్ ప్రయోగించింది. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సంయుక్తంగా, పరస్పర సమన్వయంతో నిర్వహించాయి.



మసూద్ అజర్ ఫ్యామిలీ ఖతం 2

2

ఎవరీ కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్



## చంద్రబాబుకు అండగా నిలవాల్సిన
# బాధ్యత మనందరిది




- సత్యవేడులో టీడీపీ కార్యకర్తలతో మంత్రి లోకేశ్ సమన్వయ భేటీ
- సీఎం చంద్రబాబుకు మద్దతుగా నిలవాలని శ్రేణులకు ఉద్బోధ
- దేశ శత్రువులపై ప్రధాని మోదీ చర్యలకు పూర్తి మద్దతు ప్రకటన
- 10 నెలల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు
- కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత, ఐక్యతకు పిలుపు

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, సత్యవేడు**

రాష్ట్ర భవిష్యత్తు, మన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం 75 ఏళ్ల వయసులోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయనకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా సత్యవేడులోని స్థానిక సంత ప్రాంగణంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

**మోదీ వెంటే మనమంతా!**

ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, దేశ శత్రువులపై పోరాటంలో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే ప్రతి నిర్ణయానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. "పహల్గామ్ లో ఉగ్రవాదులు అమాయకులను పొట్టనపెట్టుకున్నారు. మోదీ గారు తీసుకునే ఏ నిర్ణయానికైనా మేం అండగా ఉంటాం. వంద పాకిస్థాన్‌లు వచ్చినా మన దగ్గర ప్రధాని నరేంద్ర మోదీ అనే మిసైల్ ఉంది. భారతీయులను చంపిన వారిని - మిగతా3లో



## అక్కడ జరిగిందేమిటి?
## మీరు చేస్తున్నదేమిటి?

- ఆపరేషన్ సిందూర్‌పై తప్పుడు కథనాలు రాస్తారా?
- చైనా మీడియాపై భారత్ ఆగ్రహం
- మీరు వార్తలు ప్రచురించేటప్పుడు వాస్తవాలు పరిశీలించుకోండి
- ఒకసారి క్రాస్ చెక్ చేసుకోండి
- పాత ఫోటోలతో మభ్యపెట్టి వార్తలను ప్రచురిస్తారా?
- చైనాలోని భారత్ ఎంబాసీ ధ్వజం

## 54 ఏళ్ల తర్వాత
# సిటీలో మాక్ డ్రిల్

పాకిస్థాన్‌తో యుద్ధం నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత పెంచడానికి హైదరాబాద్ నగరంలో మాక్ డ్రిల్

# కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు

- 26 మంది మావోయిస్టులు మృతి
- అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి
- రెండు ఏకే-47లను బలగాలు స్వాధీనం

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, చర్ల**

తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 26 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ మేరకు అధికార వర్గాలు వెల్లడించాయి. ఘటనా స్థలంలో కాల్పులు - మిగతా3లో






## అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టాం

- ఉగ్రదాడిలో టూరిస్టులను అత్యంత కిరాతకంగా చంపిన వారికి గట్టి సమాధానమిచ్చాం
- సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత జాగరూకతతో ఈ దాడులు నిర్వహించాం
- మన సైనికులు అద్భుత పరాక్రమం ప్రదర్శించారు
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## చంద్రబాబులా
# అబద్ధాలు చెప్పలేను

- జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయిలో ఉన్న బూత్ కమిటీల వరకూ ప్రత్యేక దృష్టిపెట్టాలి
- రీజినల్ కో-ఆర్డినేటర్లకు పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు సహాయకారులుగా ఉంటారు
- రీజినల్ కో-ఆర్డినేటర్లతో అనుసంధానమై, వారికి కాళ్లు, చేతులుగా పార్లమెంటు పరిశీలకులు పనిచేస్తారు
- నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌ఛార్జిలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడగలగాలి
- తప్పకుండా మనం అధికారంలోకి వస్తాం.. అందులో ఎలాంటి సందేహం లేదు



**చిత్తూరు ఎక్స్‌ప్రెస్, తాడేపల్లి**

మీరంతా సమర్థులని భావించి ఈ బాధ్యతలు అప్పగించడం జరిగిందని.. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులకు ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన వైఎస్సార్‌సీపీ పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయిలో ఉన్న బూత్ కమిటీల వరకూ ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. రీజినల్ కో-ఆర్డినేటర్లకు పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు సహాయకారులుగా ఉంటారు. రీజినల్ కో-ఆర్డినేటర్లతో అనుసంధానమై, వారికి కాళ్లు, - మిగతా3లో

## సైనిక బలగాలకు
# కాంగ్రెస్ పూర్తి మద్దతు

- సైనిక బలగాలకు తాము అండగా ఉంటా
- ఈ మేరకు సీడబ్ల్యూసీలో నిర్ణయం
- భారత సాయుధ దళాలను చూసి తాము గర్విస్తున్నాం
- దేశ రక్షణ, ఐక్యత, స్వేచ్ఛను కాపాడటానికి తమ పార్టీ తరఫున సైనికులకు పూర్తి మద్దతు ఇస్తున్నాం



# అకాలవర్షం భారీగా నష్ట పోయిన రైతులు






**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 07:**
అకాల భారీ వర్షాలు భారీ ఉరుములతో కూడిన ఈదురుగాలులకు మామిడి ఇతర ఉద్యాన పంటలు. పలమనేరు. గంగవరం, పెద్దపంజాణి, రూరల్ మండలాల్లో అన్ని ప్రాంతాల్లోవారం రోజుగా కురుస్తున్న భారీ వర్షంతో పాటు ఈదురుగాలకు మామిడి. టమేటా అనేక రకాల ఉద్యాన పంటలు అన్ని నేలమట్టం, బారీ వర్షాలు బలమైన ఈదురుగాలులకు కోత దశలో ఉన్న మామిడి టమేటా తదితర ఉద్యాన పంటలు పూర్తిగా దెబ్బతింది వరుసక్రమంగా వారం రోజులుగా కురుస్తున్న అకాల భారీ వర్షాలకు ఉద్యాన పంటలు అన్ని పూర్తిగా నేల పాలు అవుతున్నాయి రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. ప్రతిసారి ఈ మే నెలలో కురిసే అకాల వర్షాలకు మామిడి తోటల్లో కొమ్మలు విరిగి చెట్లలోని కాయలు నేల రాలిపోయి నష్ట పోతున్నారు. అష్టక ష్టాలు పడి పంట పెట్టుబడులకు లక్షలాది రూపాయలు అప్పులు చేసి వేసిన పంటలు చేతికందక ఏళ్ళుతర బడి నష్ట పోతున్నారు. చెట్లలోని రాలిన కాయలను మార్కెట్టుకు తీసుకుపోతే అడిగే నాదుడే లేరు ఏదో వాళ్ళకు తోచింది బిక్షం లాగా తీసుకునే పరిస్థితి ఏర్పడింది ఒక మూట 60 కిలోల కాయలకు వంద రూపాయలు ఇస్తున్నారు ఆ డబ్బులు ఆటో బాడుగకు కూడాచాలదని రైతులు వాపోతున్నారు. పకృతి వైపరీత్యాల కారణంగా సంభవించే విపత్తుల కారణంగా సంభవించే అకాల వర్షాలకు నష్టపోతున్న ఉద్యాన రైతులకు ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి జిల్లాలో అత్యధికంగా పండించే మామిడి పంటలకు ప్రత్యేక మ్యాంగో బోర్డును ఏర్పాటు చేపట్టి జిల్లాలోని మామిడి రైతులకు నష్టపరిహారం ఇప్పించి ఉద్యాన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

# మున్సిపల్ చైర్మన్‌గా సెల్వరాజ్ ప్రమాణ స్వీకారం



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 07:**
కుప్పం మున్సిపల్ చైర్మన్ గా సెల్వరాజ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వీపు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, రాజకుమార్,సోము, ఆర్.ఆర్ రవి, మున్సిపల్ సిబ్బంది పాల్గొని చైర్మన్ సెల్వరాజ్‌ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఘనంగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు



**కుప్పం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 07:**
కుప్పం పట్టణంలోని పాతపేటలో ఉన్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో జయంతి వేడుకలను, ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాసవి జయంతి సంద ర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్యులందరూ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పాత పేట ఆర్యవైశ్య సంఘం నాయకులు కమిటీ సభ్యులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# నంది వాహనంపై ఊరేగిన పరమశివుడు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 07:**
స్థానిక మృత్యుంజయశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం శివపార్వతులు నంది వాహనంపై ఊరేగారు పగలు ఇత్తడి వాహనానికి రామనాథం ఉభయదారులుగా వ్యవహరించగా రాత్రినంది వాహనానికి కడియాల మోహన్రావు గడియాల సింగల్ రాయప్ప గడియాల నగేష్ కడియాల అంజన్న కుమారులు ఉభయ దారులుగా వ్యవహరించారు. రాత్రి సమయంలో పట్టణంలోని బలిజ కులస్తులకు చెందిన మహిళలు దీపారాధన నంది వాహనంలో హైలెట్గా నిలిచింది ఏటా నంది వాహనాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ పుష్పాలతో అందంగా అలంకరించారు.

# ఆమినిగుంటలో 104 సేవలు



**చౌడేపల్లి, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 07::**
మండలంలోని ఆమెని గుంటలో బుధవారం 104 సేవలను నిర్వహించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ సదస్సు జరిగింది గర్భవతులు బాధితులను పరీక్షించే సూచనలు ఇచ్చారు. రక్తహీనత నివారణకు పౌష్టికాహారం తీసుకోమన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు శ్రీ కాలు వేయించాలన్నారు బిపి చక్కెర వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. క్రమంతప్పకుండా ప్రవేశించుకుని మందులు వాడాలని తెలిపారు. కొత్త కోడలు ఎన్టీఆర్ వైద్యసేవ కార్డులలో చిరునామా మార్పులు చేసుకో వాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వై జర్ బహుద్దిన్ హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ రమణ ఏఎన్ఎం గీత ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ ఆర్ సి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ,

**వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 07:**
జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ ఆర్ సి), సత్యవేడు నియోజకవర్గం ప్రతినిధులు కిషోర్ కుమార్,సురేశ్, గవాస్కర్ ఆధ్వర్యంలో వరదయ్యపాలెంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించ బడింది. వేడి కారణంగా ప్రజలకు ఉపశమనం కలిగించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగాజరిగిన సమావేశంలో డీవీఎంసీ మెంబెర్ గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ, "పౌరులు తమ హక్కులతో పాటు, తమభాద్యతలను కూడా గుర్తించాలని, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరం" అని పేర్కొన్నారు. భారత ప్రభుత్వం ఉగ్రవాదం అణి చివేతకు తీసుకుంటున్న కఠిన నిర్ణయాలకు సంపూర్ణ మద్దత్తు తెలుపుతూ, ఇది దేశ భద్రతకు కీలకమని ఆయన అభిప్రా యపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులు సురేశ్, గవాస్కర్, కిషోర్, రవి, శరవణ, మోహన్, మాజీ సర్పంచ్ కె వెంకటయ్య(చిన్న), అలాగే మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రజలకు మజ్జిగను అందిస్తూ వారిని వేడి నుంచి ఉపశమింపజేయడంలో అందరూ భాగస్వా ములయ్యారు.




# జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యం






**హామీల అమలు దిశగా చర్యలు**
**శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సమావేశంలో పలు అంశాలపై చర్చ**
**ఏక్రగ్రీవంగా చర్చనీయాంశాలపై తీర్మానం**

**శ్రీకాళహస్తి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 07:**
శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ సాధారణ సమావేశం బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కోటేశ్వర బాబు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా సాగిన ఈ సమావేశంలో పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సభ్యులందరి ఏకగ్రీవ అమోదంతో పలు తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో పలువురు సీనియర్ పాత్రికేయులు మాట్లాడుతూ ఒక సంవత్సర కాలపరిమితితో ఏర్పాటు అయిన ఈ ప్రెస్ క్లబ్ కార్యవర్గం బాధ్యతలు చేపట్టి ఆరు నెలల కాలం గడిచిందన్నారు. కార్యవర్గం ఎన్నికైన రోజుల వ్యవధిలోనే శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌కు మున్సిపాలిటీకి చెందిన పాత ఈ సేవా కార్యాలయం వద్ద కార్యాలయానికి గదిని కేటాయించారని తెలిపారు. అలాగే ఈ ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. ఆ తర్వాత ఎన్నికైన కార్యవర్గ సభ్యుల బాధ్యతల స్వీకరణకు ప్రమాణ స్వీకారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ సమయంలో ఇదివరకు ప్రెస్ క్లబ్ కమిటీలో ఉన్న, సభ్యులు కొంత మంది వివిధ కారణాలతో తటస్థంగా ఉంటూ వచ్చారు. కమిటీ సభ్యులు పలుమార్లు ఆహ్వానం పలికితే కొంత మంది మాత్రం ప్రెస్ క్లబ్ కార్యాలయానికి రాగా మరికొంత మంది మాత్రం స్పందించ లేదు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రెస్ క్లబ్ సభ్యులుగానున్న జర్నలిస్టు మిత్రుల సంక్షేమం కోసం ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. అందులో ప్రధానంగా ప్రెస్ క్లబ్‌కు సొంత భవనం, జర్నలిస్టుల సంక్షేమనిధి వంటి పలుహామీలు ఉన్నాయి. ప్రెస్ క్లబ్ సొంత భవనానికి అవసరమైన స్థలం విషయమై ఇప్పటికే ఎమ్మెల్యేతో చర్చించిన విషయం అందరికీ తెలిసిందే. ఈ సమయంలో ప్రెస్‌క్లబ్ కార్యవర్గంలో ఉంటూ జవాబుదారితనంతో వ్యవహరించకుండా స్వలాభం కోసం పలుచోట్ల పాల్పడిన వ్యతిరేక కార్యక్రమాల దృష్ట్యా కొంత మందిని తొలగించడం జరిగిందని తెలిపారు. దీంతో వారు తమ ప్రాబల్యం కోసం కొన్ని రాజకీయ శక్తులతో కలిసి తటస్థంగా ఉంటూ వచ్చిన కొంత మందితోపాటు మరి కొంత మంది కొత్త వారితో కలిసి పోటీ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసినట్లు ప్రకటించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని ఏకగ్రీవ నిర్ణయానికి ఈ సమావేశంలో సభ్యులు వచ్చారు. ప్రస్తుత ప్రెస్ క్లబ్ కార్యవర్గం తొలుత నిర్ణయించిన మేరకు ఏడాది పాటు కొనసాగుతుందని, ఆ తర్వాత సర్వసభ్య సమావేశంలో సభ్యుల అమోదంతో నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరుగుతుందని నిర్ణయించారు.

# అత్యంత వైభవముగా వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



**కల్లూరు, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే07:**
పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో నవ చండీ హెూమ సహిత కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవముగా నిర్వహించారు. వాసవి జయంతి ఉత్సవాల మంగళవారం సాయంత్రం గణపతి పూజతో నాంది పలికారు. ఆలయంలో బుధవారం. వేద పారాయణం. గణపతి పూజ.. కన్యకా పరమేశ్వరి ప్రధమ కలసస్థాపన హెూమాలు నిర్వహించారు మూలమూర్తికి రుద్రాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం.. శ్రీ వాసవి జయంతి కమిటీ.. ఆర్యవైశ్య మహిళా మండలి భక్తుల ఏర్పాటును పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

# కవులకు ఆత్రేయ జాతీయ పురస్కారం




**వీ.కోట, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే07:**
చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం వీ.కోటమండలం. ఆచార్య ఆత్రేయ 105వ జయంతి వేడుకలు భారతీయ రచయితలసమాఖ్య(దక్షిణభారతదేశం )ఆధ్వర్యంలో చిత్తూరు పట్టణంలో ఘనంగా జరిగినవి. ఈ సందర్భంగా వి.కోట పట్టణంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు, కవులు డాక్టర్ కవి కోకిల కొఠారి వెంకటరత్నం, డాక్టర్ జి.శాంత కుమారిలకు ఆచార్య ఆత్రేయ జాతీయపురస్కారం. 2025.అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కవిసమ్మేళనంలో వీరు తమ కవి తాగానంతో అలరించారు.ఈ కార్యక్రమంలో సమాఖ్య జాతీయ అధ్యక్షులు డాక్టర్ మర్రి పూడి దేవేంద్ర రావు, డాక్టర్ సి. నారా యణరెడ్డి, ప్రముఖ కవులు టి.గోవిందన్. సోము ఉమాపతి, నందిపాటి చక్రపాణి, కోటీశ్వర మొదిలియార్, గొడుగు చింత గోవిందయ్య, డాక్టర్ కె.సి.లావణ్య, రాజు, మునింద్రా. రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బెడ్ మ్యాట్రెస్ పంపిణీ




**ఎస్ఆర్‌పురం, చిత్తూరు ఎక్స్‌ప్రెస్, మే 07:**
రెడ్ క్రాస్ సంస్థ జీడినెల్లూరు ఆధ్వర్యంలో బెడ్ మ్యాట్రెస్ పంపిణి: ఆరుమాకులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు మంగళవారం రోజు రెడ్‌క్రాస్ సంస్థ జీడి నెల్లూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం రోజున ప్రజల అవసరార్థం బెడ్ మ్యాట్రెస్‌లు మరియు బెడ్షీట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ లయన్ వి శ్రీధర్ రెడ్డి, సభ్యులు జమీర్, సాజిద్బేగ్, ప్రసాద్ రెడ్డి, పాపిరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ గౌరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆసుపత్రిలో బెడ్లు సరిగా లేనందున వైద్యం కోసం వచ్చి రోగులు ఇబ్బంది, పడుతున్నారని ఈ విషయాన్ని రెడ్ క్రాస్ సంస్థ వారి దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించి బెడ్లు, బెడ్ షీట్స్ అందించడం గొప్ప విషయం అని తెలియ జేశారు, అడిగిన వెంటనే అవసరార్థం వసతులు కల్పించిన టువంటి ప్రెసిడెంట్ శ్రీధర్ రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్






**శాంతిపురం,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే07:**
కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం కేంద్రంలోని సచివాలయ ప్రాంగణంలో ఉండు వెలుగు కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమాన్ని మహి ళలు సద్విని యొగపర్చుకుని శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లను తీసుకొని మహిళ లు స్వయం ఉపాధిపొంది ఆర్థిక స్వావలంబన ను సాధిస్తారని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిం చారన్నారు. ఈ కార్యక్రమంలో కడా పి.డి.వికాస్ మర్మత్, ఎం.పీ.డీ. ఓ.కుమార్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్ నాయుడు, గుంజార్ల పల్లి సర్పంచ్ జనీ, మాజీ వైస్ ఎం.పీ.పీ.నందిగమ్ ఉదయ్ కుమార్, ఉయ్యాల జయరామిరెడ్డి నాయకులు చంద్ర, ఆర్.ఎస్.మణి, ఏ.ఎం.సి. నాగరాజు, మహిళా నాయకురాలు కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, సుగుణ, శ్యామల, రమ్య, మండల సచివాలయ సిబ్బంది, మహిళలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

# చంద్రబాబుకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిది

-మొదటిపేజీ తరువాయి

వదిలిపెట్టకూడదనే లక్ష్యంతో పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పారు" అని అన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం పోరాడుతున్న సైనికులను ఆయన ప్రశంసించారు.

**వారే నాకు స్ఫూర్తి**

నియోజకవర్గ పర్యటనల్లో తొలుత కార్యకర్తలతోనే సమావేశమవుతానన్న మాటకు కట్టుబడి ఉన్నానని లోకేశ్ తెలిపారు. కార్యకర్తలు లేనిదే తెలుగుదేశం పార్టీ లేదని, వారి త్యాగాలే పార్టీకి స్ఫూర్తి అని అన్నారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ పత్రాలు చించేస్తుంటే వీరోచితంగా పోరాడిన అంజిరెడ్డి తాత, బూత్‌లో రిగ్గింగ్ అడ్డుకునేందుకు రక్తం చిందించిన మంజులారెడ్డి, మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అని నినదించిన తోట చంద్రయ్య తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందని, మహానాడు నాటికి కమిటీల ఏర్పాటు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

**ఏదైనా ఉంటే కూర్చుని మాట్లాడుకుందాం**

పార్టీలో సంస్కరణల కోసం కృషి చేస్తున్నానని, ఏ సమస్య అయినా అందరం కలిసి కూర్చొని సామరస్యంగా పరిష్కరించుకుందామని లోకేశ్ సూచించారు. "2019 నుంచి 2024 వరకు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. చంద్రబాబు గారిని, నన్ను అనేక ఇబ్బందులు పెట్టారు. ఇప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నాం. నియోజకవర్గంలో ప్రత్యేక సమస్యలు ఉన్నందున ఇద్దరు పరిశీలకులను నియమించాం. ఇక్కడ జరిగే ప్రతి విషయం చంద్రబాబు గారికి తెలుసు. ఆయన కూడా కార్యకర్తలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు" అని తెలిపారు.

రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమిగా ఏర్పడ్డామని, ప్రధాని మోదీ రాష్ట్రానికి సంబంధించిన అన్ని విజ్ఞప్తులను నెరవేరుస్తున్నారని లోకేష్ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగనివ్వలేదని, అమరావతి నిర్మాణానికి ప్రధాని మద్దతు పలికారని గుర్తుచేశారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని ప్రస్తావించారు. అంతిమంగా, మన కోసం, మన పిల్లల భవిష్యత్ కోసం చంద్రబాబు పడుతున్న తపనకు మనమంతా అండగా నిలవాలని మరోసారి ఉద్బోధించారు.

ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జోన్ ఇన్‌ఛార్జి దీపక్ రెడ్డి, టీడీపీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహ యాదవ్, పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, బాబు, నియోజకవర్గ కోఆర్డినేటర్ డా.శ్రీపతిబాబు తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను

-మొదటిపేజీ తరువాయి

చేతులుగా పార్లమెంటు పరిశీలకులు పనిచేస్తారు. నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌ఛార్జిలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడగలగాలి. మీరు పరిశీలకుడిగా ఉన్న ఏడు నియోజకవర్గాల్లో ఎంతమందిని ఎమ్మెల్యేలుగా గెలిపిస్తారనేది మీకు పరీక్ష. మీ పనితీరు ఆధారంగా మీకు మంచి మంచి పదవులు వస్తాయి.. తప్పకుండా మనం అధికారంలోకి వస్తాం, అందులో ఎలాంటి సందేహం లేదు.. ఈ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం లేదు" అని వైఎస్ జగన్ చెప్పారు.

"ప్రజలకిచ్చిన హామీలను పూర్తిగా పారదర్శకంగా అమలు చేసిన మనకే ఇలాంటి పరిస్థితి వచ్చింది. ఇక అబద్ధాలు చెప్పి, మోసాలు చేసిన చంద్రబాబు పరిస్థితి ఎలా ఉంటుంది?. 2014లో కూడా చంద్రబాబు తానిచ్చిన హామీలను అమలు చేయలేదు. మనం పాదయాత్ర చేసి, ప్రజలకు భరోసా ఇచ్చాం. 2019 ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకత కొట్టిచ్చినట్టు ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. ప్రజావ్యతిరేకతను చీల్చడానికి చంద్రబాబు తన రాజకీయ భాగస్వామిని వేరేగా పోటీచేయించారు. అయినా చంద్రబాబు తన ఓటమిని అడ్డుకోలేకపోయారు. చంద్రబాబు రాకముందు.. మన పథకాల ద్వారా పేదల నోట్లోకి నాలుగు వేళ్లూ వెళ్లేవి. ఇప్పుడు చంద్రబాబు ప్రజలు తింటున్న కంచాన్ని లాగేశాడు" అని వైఎస్ జగన్ మండిపడ్డారు.

"అంతేకాదు తానిచ్చిన హామీలను కూడా చంద్రబాబు అమలు చేయలేదు. రెండు రకాలుగా చంద్రబాబు ప్రజలను మోసం చేశాడు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలు పూర్తిగా నీరుగారిపోయాయి. ఉచిత పంటల బీమా గాలికి ఎగిరిపోయింది. రైతులకు పెట్టుబడి సహాయంగా ఉన్న రైతు భరోసా ఎగిరిపోయింది. అవినీతి విచ్చలవిడిగా జరుగుతోంది. రూపాయికి ఇడ్లీ వస్తుందో లేదో తెలియదు కానీ, అదే రూపాయికి వేల కోట్ల విలువైన భూములు కట్టబెడుతున్నారు. లూలుకు రూ.1500 కోట్ల భూములు కట్టబెట్టారు. మరొకరికి రూ.3వేల కోట్ల భూములు కట్టబెట్టారు.

..రైతులకు ఉచితంగా విద్యుత్ అందించడానికి సెకీతో మనం రూ.2.49లకే విద్యుత్ కొనుగోలు చేశాం. కాని ఇవాళ వీళ్లు రూ.4.60లకు కొనుగోలు చేశారు. సెక్షన్ 108 ప్రకారం ఏపీఆర్సీపీమీద ఒత్తిడి తెచ్చి మరీ అమలు చేయించుకున్నారు. అవినీతి మన కంటికి కనిపిస్తోంది. మట్టి మాఫియా, ఇసుక మాఫియా, పేకాట క్లబ్బులు, బెల్టుషాపులు, ఎమ్మార్పీ ధర కన్నా లిక్కర్ ఎక్కువకు అమ్ముకుంటున్నారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేకు మట్టజెప్పనిదే ఏమీ కావడంలేదు. ఇవన్నీ కంటికి కనిపిస్తున్నాయి. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. ఒక్కసారి ఓటు వేశాక, ఐదేళ్లపాటు ప్రజలు వేచి చూడాలి. అందుకే ఇప్పుడేమీ చేయలేక ప్రజలు అన్నింటినీ చూస్తున్నారు ..సమయం వచ్చినప్పుడు కచ్చితంగా ప్రజలు కచ్చితంగా తగిన తీర్పు ఇస్తారు. ఇప్పుడు కలియుగం పాలిటిక్స్ నడుస్తున్నాయి. కేసులకు భయపడితే రాజకీయాలు చేయలేం. చంద్రబాబు రాజకీయాలను ఒక దారుణమైన స్థాయికి తీసుకెళ్లారు. రాజకీయాల్లో ఇలాంటి పరిస్థితులు ఉండకూడదని మన ప్రభుత్వంలో చాలా కష్టపడ్డాం. మన పరిపాలనలో చాలామంది నాయకులను కట్టడి చేశాం. తాడిపత్రిలో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు టీడీపీ స్వల్ప ఆధిక్యత వచ్చింది. వైఎస్సార్‌సీపీకి 16, టీడీపికి 18 వచ్చాయి. కాని అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మన పార్టీ వైపునకు ఫలితాన్ని తిప్పుదామని యత్నించారు. ఆ రోజు మన పార్టీ ఎమ్మెల్యే అయిన పెద్దారెడ్డిని గృహనిర్బంధం చేశాం. ఇప్పుడు ఏడాది కాలంగా పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగుపెట్టనీయడంలేదు. కార్యకర్తల ఆస్తులను విధ్వంసం చేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయి. చంద్రబాబు రెడ్‌బుక్ రాజ్యాంగం, కక్ష రాజకీయాలతో రాజకీయ వ్యవస్థ దారుణంగా తయారైంది" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. "ఈ ప్రభుత్వం చేసిన దుర్మార్గాలు చూసిన తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. కార్యకర్తలకు కచ్చితంగా ప్రాధాన్యత ఉంటుంది. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరినీ గొప్ప స్థానంలో కూర్చోబెడతాను. ఈ సారి కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత. చంద్రబాబులా అబద్ధాలు చెప్పలేను. ప్రజలకు హామీలు ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తాను. కార్యకర్తల్లో ఇప్పటికే మంచి చైతన్యం వచ్చింది. కేడర్ ధైర్యంగా నిలబడింది. రాష్ట్రవ్యాప్తంగా నేను ఎక్కడకు వెళ్లినా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివస్తున్నారు. రాష్ట్రంలో అరాచక పాలన పట్ల వివిధ రూపాల్లో వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు పరిపాలన పట్ల తీవ్రమైన ఆగ్రహం ఉంది. రాజకీయాలతో సంబంధం లేనివారినికూడా కక్షలకు గురిచే స్తున్నారు. వచ్చే ఏడాది ప్లీనరీని నిర్వహిద్దాం. బ్రహ్మాండంగా ప్లీనరీని నిర్వహిద్దాం. ..బూత్ కమిటీలు పూర్తయ్యే సరికి పార్టీ నిర్మాణంలో దాదాపుగా 18 లక్షలమంది ఉంటారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధరలేదు, కనీస మద్దతు ధర అందడంలేదు. వైఎస్సార్ ప్రభుత్వం హయాంలో ప్రతి గ్రామ సచివాలయంలో కనీస మద్దతు ధరలతో జాబితాను పెట్టేవాళ్లం. ఎంఎస్పీ కన్నా తక్కువ ధర వస్తే అప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకునేది. పొగాకు విషయంలో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జోక్యంచేసుకునేది. ప్రైవేటు కంపెనీలతో పోటీపడి వేలంలో పాల్గొన్నాం. రైతులను ఆదుకున్నాం. అలాగే ఆయిల్‌పాం రైతులను ఆదుకున్నాం. తెలంగాణతో సమాన స్థాయిలో ధర వచ్చేలా చూశాం. ఎలాంటి విపత్తులు వచ్చినా రైతులను ముందుగా ఆదుకునే వాళ్లం. ..ధాన్యానానికి ఎంఎస్పీ ఇవ్వడమే కాదు, ఎంఎస్పీకి అదనంగా జీఎల్టీ కూడా ఇచ్చాం. వ్యవసాయరంగంపై ఇంత ఫోకస్ పెట్టిన ప్రభుత్వం మనదైతే, ఏ ఫోకస్ పెట్టని ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. పంటలకు నష్టం వస్తే సీజన్ మగిసేలోగా వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేవాళ్లం. మళ్లీ సీజన్‌లోగా పరిహారిం ఇచ్చేవాళ్లం. క్రమంగా ప్తతకుండా ఇన్సూరెన్స్ ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఏమీ లేవు. క్రమం తప్పకుండా ఐదేళ్ల పాటు మనం రైతులకు పెట్టుబడి సహాయం అందించేవాళ్లం" అని వైఎస్ జగన్ గుర్తు చేశారు.



# అందాల పోటీలకు భాగ్యనగరం ముస్తాబు

**హైదరాబాద్ :** మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ రెడీ అయింది. ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రస్తుతం సందడిగా మారింది, వివిధ దేశాల నుంచి అందాల పోటీదారులు ఇక్కడ దిగుతున్నారు. విదేశీ ప్రతినిధులకు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయంలో ప్రత్యేక లాంజ్‌లు, సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయబడ్డాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.. అటు.. మిస్ వరల్డ్ పోటీలపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కాక రేపుతోంది. ఈ క్రమంలో.. మంత్రి జూపల్లి కృష్ణారావు విపక్షాల విమర్శలపై స్పందించారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకే మిస్ వరల్డ్ పోటీలు.. అంటూ.. అందాల పోటీలపై విపక్షాల కామెంట్స్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. పెట్టుబడుల సంగతి ఎలా ఉన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి మాత్రం షురూ అయింది. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే సుమారు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారు. వారిలో మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్ వంటి వారు ఉన్నారు. పర్యాటక శాఖ అధికారులు వీరికి విమానాశ్రయంలో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అనంతరం వారిని బస ఏర్పాటు చేసిన హోటళ్లకు తరలించారు. ఈ మిస్ వరల్డ్ పోటీల్లో పాకిస్తాన్ కూడా ప్రాతినిధ్యం వహిస్తోంది. మిస్ పాకిస్తాన్ కూడా ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం. , అంతర్జాతీయ స్థాయిలో నగరం ప్రతిష్టను పెంచే ఈవెంట్‌కు అంతా సిద్ధమైంది. ఈ నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానుండగా.. 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలేతో ముగియనున్నాయి. అదే రోజు విజేతను ప్రకటిస్తారు. జూన్ 2న జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల్లో మిస్ వరల్డ్‌గా నిలిచిన సుందరీమణి పాల్గొంటారు. ఈ పోటీలకు 116 దేశాలకు చెందిన పోటీదారులు హాజరుకానున్నారు. దాంతో.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్ హైటెక్స్ వరకూ బ్యానర్లు, కటౌట్లు కళకళలాడిపోతున్నాయి. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనేందుకు ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే.. మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో సెర్వాన్‌టెస్, మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే సహా దాదాపు 90 మందికిపైగా పోటీదారులు హైదరాబాద్‌లో అడుగు పెట్టారు.

## కర్రెగుట్టల్లో ఎదురు కాల్పులు..

-మొదటిపేజీ తరువాయి

కొనసాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌ను డీఆర్జీ, కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్, సీఏఎఫ్ బలగాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. దీన్ని ఏడీజీ వివేకానంద సిన్హా పర్యవేక్షిస్తున్నారు. సీఆర్పీఎఫ్ ఐజీ రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందరరాజ్ ఎప్పటికప్పుడు ఆపరేషన్‌పై ఆరా తీస్తున్నారు. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

**అల్లూరి జిల్లాలో ఎదురుకాల్పులు.. నలుగురు మావోయిస్టులు మృతి**

మరోవైపు, ఏపీలోని అల్లూరి జిల్లా వై.రామవరం, జీకేవీధి మండలాల సరిహద్దుల్లో భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈ క్రమంలోనే రెండు ఏకే-47లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఘటనాస్థలంలో ఇరుపక్షాల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయి.

## 54 ఏళ్ల తర్వాత సిటీలో మాక్ డ్రిల్

పాకిస్థాన్ తో యుద్ధం నేపథ్యంలో ప్రజల్లో అప్రమత్తత పెంచడానికి హైదరాబాద్ నగరంలో మాక్ డ్రిల్ నిర్వహించామని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ చెప్పారు. 54 సంవత్సరాల తర్వాత జరిగిన మాక్ డ్రిల్ ఇదని ఆయన పేర్కొన్నారు. మాక్ డ్రిల్ లో.. తమ తమ లోపాలను సమీక్షించుకుని అప్రమత్తత మెరుగు పర్చేలా చేశామని తెలిపారు. యుద్ధానికి సంబంధించి లేదా ఇతర ఏ విషయాలకు సంబంధించైనా తప్పుడు వార్తలను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు.

ఇవాళ మధ్యాహ్నం హైదరాబాద్ నగరంలో మాక్ డ్రిల్ నిర్వహించన అనంతరం సీపీ సీవీ అనంద్ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఇందులో ఆయన ఏం చెప్పారంటే.. "నాలుగు గంటలకు కమాండ్ కంట్రోల్స్ సెంటర్ నుండి అలెర్ట్ ఇచ్చాం. రెండు నిమిషాల పాటు పోలీస్, ఫైర్ వాహనాలు, ఇండస్ట్రియల్ సైరన్లు మోగాయి. నాలుగు ప్రాంతాల్లో మిస్సైల్ అటాక్ జరిగినట్లు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి సందేశం ఇచ్చాం. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు ఈ మాక్ డ్రిల్ లో పాల్గొన్నారు. నాలుగు ప్రాంతాల్లో పోలీసులు, మెడికల్, ఫైర్ డిజాస్టర్ రెవిన్యూ ఇతర విభాగాల అధికారులు అందుబాటులో ఉన్నారు. మిస్సైల్ అటాక్ జరిగిన ప్రాంతాలకు తరలి వెళ్లడం.. మంటలు అంటుకుంటే ఆర్పడం వంటి అంశాలను డ్రిల్ లో చూపించాం. అంబులెన్స్ లు రావడానికి వెళ్లడానికి ట్రాఫిక్ క్లియరెన్స్ ఇచ్చాం. ఈ మాక్ డ్రిల్ లో లా అండ్ ఆర్డర్ పోలీసులు క్రౌడ్ కంట్రోల్ చేశారు. మాక్ డ్రిల్ లో భాగంగా గాయపడిన క్షతగాత్రులకు వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు." అని ఆనంద్ వెల్లడించారు. ఇలా ఉండగా, అటు నగరంతో పాటు, ఏపీలోని కీలక నగరమైన విశాఖలోనూ నగర పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు

## ప్రజాధనం వృథా కానివ్వం

-మొదటిపేజీ తరువాయి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు. కృష్ణానది పై పలు చోట్ల టెలిమెట్రి పరికరాలు ఏర్పాటు అంశం కూడా ఉంది. అనంతరం సమావేశం గురించి ఉత్తమ్ వివరాలు వెల్లడించారు. 'మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీ లను పునరుద్ధరించాలా లేదా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. మేడిగడ్డ డిజైన్.. ఆపరేషన్ లోపాలు ఉన్నాయని ఎన్ డి ఎస్ ఏ నివేదిక స్పష్టం చేసింది. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రాజెక్ట్ పునరుద్ధరణ ఎలా చేయాలని మార్గాలు అన్వేషిస్తున్నాం. డిపిఆర్ లో చూపెట్టిన స్థలం వేరు, ఒక ప్రాంతంలో కడతామని మరో ప్రాంతంలో మేడిగడ్డ కట్టారు. మేడిగడ్డ , సుందిళ్ల బ్యారేజ్ ల విషయంలో సిడబ్ల్యుసి సంప్రదింపులతో ముందుకు వెళ్లాలని ఎన్డీఎస్ఏ సూచించింది. పాడైపోయిన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజ్ లపై ఎలా ముందుకెళ్లాలనే దానిపై చర్చించా. తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్టు కడతాం. సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు 44 టిఎంసిల నీటి కేటాయింపులు వేగంగా జరపాలని కోరా. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కి 90 టీఎంసీలు నీటి కేటాయింపులు చేశారు. మొదటి ఫేస్ కింద వాటిలో తక్షణమే 45 టీఎంసీలు కేటాయించాలని విజ్ఞప్తి చేశాను. అక్రమ నీటి తరలింపుకు చెక్ పెట్టేందుకు కృష్ణాజలాలకు టెలిమెట్రీ పెట్టాలని కోరాం. పోలవరం బ్యాక్ వాటర్ తో తెలంగాణ కొంత ముంపుకు గురయ్యే ప్రమాదం ఉంది. దానికి రిటెన్షన్ వాల్ ను నిర్మించాలని కోరాం." అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

## ఇలాంటి సమయంలో రాజకీయాలకు తావులేదు



-మొదటిపేజీ తరువాయి

హెూం సెక్రటరీ రవి గుప్తా, ఆర్మీ, పోలీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల రక్షణకు సంబంధించి అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం(మే8) సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సెక్రటేరియట్ నుంచి నెక్లెస్ రోడ్ వరకు ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు,ఇతర నేతలు పాల్గొననున్నారు.

విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అసవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఇవ్వాలని అన్నారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్తనిల్వలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అత్యవసర మెడిసిన్ సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైన ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రెడ్ క్రాస్ సమన్వయం చేసుకోవాలని అన్నారు. ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపాలని హెచ్చరించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని సూచించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని ఆదేశించారు. ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సూచించారు. రౌడీషీటర్‌లపైన, పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

## ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ
# సమావేశాలు నిర్వహించాలి



**చౌడేపల్లి,చిత్తూరు ఏక్స్ ప్రెస్,మే 07:** ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు విధిగా నిర్వహించాలని పలువురు, దళిత నాయకులు బుధవారం తాసిల్దార్‌కు వినతిపత్రం అందించారు. మండల వ్యాప్తంగా దళితుల సమస్యలు అధికంగా ఉన్నాయని, ఈ మేరకు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ సివిల్స్‌డే వంటి కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని వారు తాసిల్దారులు కోరారు. కార్యక్రమంలో బ్యాంకు రెడ్డప్ప కృష్ణమూర్తి బస్టాండ్ శేఖర్ గంగాధరం శ్రీనాథ్ మాజీ సర్పంచ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సింధూర్ విజయవంతం సందర్భంగా
# జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ



**కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, మే 07:**
భారత సైన్యం చేసిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం సందర్భంగా కుప్పం పట్టణంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించి, కుప్పం బస్‌స్టాండ్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులుఆర్పించడం జరిగింది.అనంతరం మానవహారం చేసి నరేంద్రమోడీ సర్కారు వారి నాయకత్వం వర్ధిల్లాలి అని పాకిస్తాన్ పైన దాడి, చేసిన ఎక్కడ కూడా సామాన్య ప్రజల పైనకా కుండా కేవలం ఉగ్రవాదుల స్థావరాల మాత్రమే వెతికి మరి మత్తికరిపించిన వీర జవానులకు సెల్యూట్ అని తెలిపారు. నరేంద్ర మోడీ సర్కారు తీసుకునే ఏ నిర్ణయానికి అయ్యిన ప్రతి భారతీయుడు శిరసావహిస్తారు. ఈ కార్యక్రమంలో జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి నరేష్, బిజెపి నాయకులు తులసినాథ్, గోపీనాథ్, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పిడుగుపాటు మృతులకు ఎమ్మెల్యే సంతాపం



**శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్,మే 07:** శ్రీకాళహస్తి మంగళవారం కురిసిన వర్షాలకు ప్రమాదవశాత్తు మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి. వర్షాలకు ప్రమాదవశాత్తు మృత్యువాత పడ్డ వికృతమాల వద్ద ఎల్లప్పరెడ్డి, చిందేపల్లి యస్‌సి కాలనీ ఆంజనేయులు,వారి భౌతిక కాయాలకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డి తో కలిసి పరామర్శించి ప్రభుత్వం తరఫున అన్ని విధాల ఆదుకుంటామని తెలిపిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి .

# జీఎస్టీ లేకుండా దుబాయ్ రేట్లకు చీప్‌గా బంగారం ఎలా కొనాలి?

హైదరాబాద్‌లో 22 క్యారెట్ బంగారం తులం ధర ఇటీవల కొండెక్కిన సంగతి తెలిసిందే. రూ. లక్షకు చేరువై తిరిగి పెరుగుతూ తగ్గుతూ ఊగిసలాడుతోంది. ఆభరణాల కొనుగోలు సమయంలో మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ, తరుగు ఛార్జీలు కలిసి మొత్తం ఖర్చును మరింత పెంచుతాయి. భారతదేశంలో బంగారం కేవలం పెట్టుబడి కాదు, సంస్కృతి, సంప్రదాయాలతో లోతుగా ముడిపడిన భాగం. ముఖ్యంగా మహిళలు పండుగలు, వివాహాలు, శుభ సందర్భాలలో బంగారు ఆభరణాలను కొనుగోలు చేసి ధరించడానికి ఆసక్తి చూపిస్తారు. ఈ సాంప్రదాయం బంగారం డిమాండ్‌ను ఎప్పటికీ ఉన్నత స్థాయిలో ఉంచుతుంది. అయితే, భారత్‌లో బంగారం ధరలు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. దుబాయ్‌లో బంగారం కొనుగోలు చేయడం భారతీయులకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది, ఎందుకంటే అక్కడ బంగారం స్వచ్ఛత ఉన్నతంగా ఉండడమే కాకుండా ధరలు రీజనబుల్‌గా తక్కువగా ఉంటాయి. అదనంగా, దుబాయ్‌లో బంగారం కొనుగోలుపై పన్నులు లేకపోవడం, దిగుమతి సుంకాలు అవసరం లేకపోవడం, పోటీతత్వం వల్ల అందించే ఆఫర్లు దీనిని మరింత లాభదాయకంగా చేస్తాయి. ఈ కారణాల వల్ల చాలా మంది దుబాయ్ నుంచి బంగారం తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తారు, కొందరు చట్టవిరుద్ధ మార్గాలను కూడా ఎంచుకుంటారు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) నిబంధనల ప్రకారం, దుబాయ్‌లో 6 నెలలకు పైగా నివసించిన వ్యక్తులు కస్టమ్స్ డ్యూటీ చెల్లించి 1 కిలో వరకు బంగారాన్ని తమ బ్యాగేజీలో తీసుకురావచ్చు. ఈ పరిమితిని దాటితే, బంగారం సుంకం చెల్లించినదిగా (డ్యూటబుల్ గోల్డ్) నిరూపించి, రెడ్ ఛానెల్ ద్వారా కస్టమ్స్ విధానాలను పాటించాలి. ప్రస్తుతం భారత్‌లో బంగారం దిగుమతి సుంకం 6% గా ఉంది, దీనిని కొందరు తప్పించుకునేందుకు స్మగ్లింగ్‌కు ప్రయత్నిస్తారు, ఇటీవల కన్నడ నటి రన్యా రావు 14 కిలోల బంగారంతో బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన సంఘటన దీనికి ఉదాహరణ.



కస్టమ్స్ సుంకం చెల్లించకుండా కూడా కొంత పరిమాణంలో బంగారం తీసుకురావచ్చు, అయితే దీనికి నిర్దిష్ట పరిమితులు ఉన్నాయి. పురుషులు రూ. 50,000 విలువ కలిగిన 20 గ్రాముల వరకు బంగారాన్ని (బార్లు లేదా నాణేల రూపంలో) తీసుకురావచ్చు. మహిళలు రూ. 1 లక్ష విలువ కలిగిన 40 గ్రాముల వరకు బంగారాన్ని (ఆభరణాలు, బార్లు లేదా నాణేల రూపంలో) వ్యక్తిగత వినియోగం కోసం తీసుకురావచ్చు. 15 ఏళ్ల లోపు పిల్లలు కూడా 40 గ్రాముల వరకు బంగారాన్ని (నగలు లేదా బహుమతుల రూపంలో) సుంకం లేకుండా తీసుకురావచ్చు. అయితే, కస్టమ్స్ అధికారులు బంగారం కొనుగోలు వివరాలు, రసీదులు, పిల్లల విషయంలో తల్లిదండ్రుల గుర్తింపు వంటి డాక్యుమెంట్లను పరిశీలిస్తారు. దుబాయ్ నుంచి బంగారం తెచ్చేటప్పుడు చట్టబద్ధమైన మార్గాలను అనుసరించడం ముఖ్యం. హాల్‌మార్క్ ఉన్న బంగారాన్ని కొనుగోలు చేయడం, కొనుగోలు రసీదులను సురక్షితంగా ఉంచడం అవసరం. స్మగ్లింగ్ వంటి అక్రమ మార్గాలు చట్టపరమైన ఇబ్బందులు, జరిమానాలు లేదా జైలు శిక్షకు దారితీయవచ్చు. బంగారం కొనుగోలు సమయంలో దుబాయ్‌లో అందుబాటులో ఉన్న ఆఫర్లు, సీజనల్ డిస్కౌంట్లను వినియోగించుకోవడం ద్వారా ఖర్చును మరింత తగ్గించుకోవచ్చు. ఈ నిబంధనలను గమనిస్తూ, సరైన ప్రణాళికతో దుబాయ్ నుంచి బంగారం తెచ్చుకోవడం ఆర్థికంగా, సాంస్కృతికంగా లాభదాయకంగా ఉంటుంది.

## ఎలక్ట్రిక్ కారు కొనాలనుకునేవారికి బెస్ట్ ఆప్షన్లు..

మన దేశంలో ఎలక్ట్రిక్ కార్లకు డిమాండ్ పెరుగుతోంది. నెమ్మదిగా పర్యావరణ హిత వాహనాలు తమ ముద్ర వేస్తున్నాయి. అనేక రకాల మోడళ్లు మన దేశంలో అందుబాటులో ఉంటున్నాయి. ముఖ్యంగా సంప్రదాయ పెట్రోల్ డీజిల్ వాహనాల ధరలు పెరుగుతుండటం, వాటి మెయింటెనెన్స్ అధికమవడంతో పాటు పెట్రోల్ రేట్లు కూడా భారీ పెరగడంతో అందరూ ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారు. చాలా మంది ఈ కార్లపై అనేక రకాల సందేహాలు వ్యక్తపరుస్తున్నప్పటికీ వాటి సేల్స్ మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. అందుకు ప్రధాన కారణం అవి మెయింటెనెన్స్ ఫ్రీ కావడంతో పాటు పూర్తి పర్యావరణ హితం కావడమే. అయితే వీటి ధరలు కాస్త ఎక్కువగానే ఉంటున్నాయి. అయితే రూ. 10లక్షల లోపు కూడా మంచి బ్రాండ్ ఎలక్ట్రిక్ కార్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో టాటా మోటార్స్, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్ వంటివి ఉన్నాయి. భారతదేశంలో అత్యంత చవకైన ఎలక్ట్రిక్ కారు ఎంజీ కామెట్ ఈవీ. ఇది రూ. 7 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరకు అందుబాటులో ఉంది. దీనిలో బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ (బీఏఏఎస్) ఎంపికతో వస్తుంది. ఇది మరింత సరసమైనదిగా చేస్తుంది. ఎంజీ కామెట్ ఈవీ ఒక కాంపాక్ట్ డిజైన్‌ను కలిగి ఉంటుంది. ఇది



నగర ట్రాఫిక్ లో ప్రయాణించడానికి అనువుగా ఉంటుంది. అంతేకాక రద్దీగా ఉండే ప్రదేశాలలో ఎక్కువ ఇబ్బంది లేకుండా పార్క్ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఈ ఈవీ హైవే డ్రైవింగ్‌కు తగినది కానప్పటికీ, నగరంలో, చుట్టుపక్కల రోజువారీ ప్రయాణానికి బెస్ట్ ఎంపికగా ఉంటుంది. క్యాబిన్ లోపల ఉన్న అనేక రకాల అప్ గ్రేడెడ్ ఫీచర్లు ఉంటాయి. ఇవి ఈ కారును మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి. ఈ కారు భారతదేశంలో రెండవ అత్యంత సరసమైన ఎలక్ట్రిక్ కారు. అలాగే ఇది దేశంలోనే అత్యంత సరసమైన టాటా ఎలక్ట్రిక్ కారు కూడా. ఇది రూ. 7.99 లక్షల (ఎక్స్-షోరూమ్) ప్రారంభ ధరకు అందుబాటులో ఉంది. టాటా టియాగో ఈవీ ఒక కాంపాక్ట్ డిజైన్‌తో వస్తుంది. ఇది నగరంలో, చుట్టుపక్కల రోజువారీ ప్రయాణానికి ఉద్దేశించిన సరసమైన, డబ్బుకు విలువైన ఈవీ కోసం చూస్తున్న వినియోగదారులకు ఆచరణాత్మక ఎలక్ట్రిక్ కారుగా ఉండటానికి వీలు కల్పిస్తుంది. టియాగో ఈవీ ఒకే చార్జ్‌పై 315 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలగుతుంది.

## దేశ ప్రజలే భారతమాతకు రక్షణ కవచం..
# భారత బలగాలపై క్రికెటర్ సచిన్ ప్రశంసలు

పహల్గాం ఉగ్రదాడి కి ప్రతీకారంగా భారత్ బలగాలు బుధవారం తెల్లవారుజామున ఆపరేషన్ సింధూర్ నిర్వహించాయి. ఆ ఆపరేషన్‌లో భాగంగా పాకిస్థాన్ లోని మొత్తం 9 ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు దాడులు చేసి పదుల సంఖ్యలో ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. బలగాలు విజయవంతగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌పై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు సచిన్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఐకమత్యంలో భయం ఉండదని, బలానికి ఎల్లలు లేవని, దేశ ప్రజలే భారత మాతకు రక్షణ కవచమని సచిన్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రపంచంలో ఉగ్రవాదానికి తావు లేదని, మనమంతా ఒక జట్టని అన్నారు. కాగా సచిన్ టెండూల్కర్ సందర్భం వచ్చిన ప్రతిసారి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మాట్లాడారు. 2008 నవంబర్ 26న జరిగిన ఉగ్రదాడిపై కూడా సచిన్ స్పందించారు. అప్పుడు ఆయన ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ ఒక పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చారు. 'నా అభిప్రాయంలో ఇది దేశంపై జరిగిన దాడి. ఇది ప్రతి భారతీయుడి హృదయాన్ని



దెబ్బతీసింది. ఇది కేవలం ముంబై ప్రజలపై దాడి కాదు.' అని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో సచిన్ ఇంగ్లండ్‌పై సెంచరీ చేశారు. ఆ సెంచరీని ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి అంకితం ఇస్తున్నట్లు ప్రకటించారు.

# ముంబై ఇండియన్స్‌పై ఎఫెక్ట్

ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ ముంబై ఇండియన్స్‌పై పడింది. తమ తదుపరి మ్యాచ్ కోసం ముంబై ఇండియన్స్ ఇవాళ (మే 7) సాయంత్రం ముంబై నుంచి చండీఘడ్ మీదుగా ధర్మశాలకు ప్రయాణించాల్సి ఉంది. అయితే ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో ముంబై ఇండియన్స్ ధర్మశాల ప్రయాణం వాయిదా పడింది. భారత ప్రభుత్వం సూచనల మేరకు చండీఘడ్ సహా దేశంలో పలు విమానాశ్రయాలు మూసివేశారు. చాలా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇందులో ముంబై ఇండియన్స్ ప్రయాణించాల్సిన విమాన సర్వీస్ కూడా ఉంది. బీసీసీఐ నుంచి తదుపరి సూచనలు వచ్చే వరకు ముంబై ఇండియన్స్ జట్టు ముంబైలోనే ఉండనుంది. ఈ నెల 11న ముంబై ఇండియన్స్ ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్ కోసమే వారు ధర్మశాల ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఈ లోపే విమాన సర్వీసులు రద్దయ్యాయి. మరోవైపు ధర్మశాలలో రేపు (మే 8) ఓ మ్యాచ్ జరుగనుంది. ఢిల్లీ క్యాపిటల్స్.. పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ కోసం ఇరు జట్లు ఇదివరకే ధర్మశాలకు చేరుకున్నాయి. కాగా, ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ దాడులకు తెగబడే అవకాశం ఉండటంతో భారత ప్రభుత్వం పలు విమానాశ్రయాలను మూసి వేయాలని సూచించింది. అయితే దీని ప్రభావం? ఐపీఎల్ పడే అవకాశం ఉంది. ఐపీఎల్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారం సాగాలంటే ఆయా జట్లు ఓ వేదిక నుంచి మరో వేదికకు విమానాల ద్వారా ప్రయాణించాల్సి ఉంది. దేశంలో పలు విమానాశ్రయాలు మూసివేసిన నేపథ్యంలో జట్ల ప్రయాణానికి ఆటంకం కలుగవచ్చు. దీని ప్రభావం ఐపీఎల్ షెడ్యూల్‌పై పడే అవకాశం ఉంది.



స్పందించిన బీసీసీఐ షెడ్యూల్ మార్పు అంశంపై బీసీసీఐ వర్గాలు స్పందించాయి. షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశాయి. ఈ విషయంపై బీసీసీఐ వర్గాలు ఇండియా టుడేతో మాట్లాడుతూ.. "పరిస్థితులను బీసీసీఐ నిశితంగా గమనిస్తోంది. ఇప్పటికైతే ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఐపీఎల్ మ్యాచ్‌లు షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తాం" అని పేర్కొన్నాయి. ముంబై ఇండియన్స్ -గుజరాత్ టైటాన్స్ మధ్య నిన్న (మే 6) జరిగిన మ్యాచ్ వర్షం కారణంగా అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా కొనసాగింది. ఈ మ్యాచ్ ముగిసిన కాసేపటికే భారత సైన్యం పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్లో ఉన్న ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో గత నెల 22వ తేదీన పాక్ ఉగ్రమూకలు దాడులకు తెగబడి 26 మంది అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్నారు. దీనికి బదులుగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్‌కు బుద్ధి చెప్పింది. ఈ క్రమంలో ఇరు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి.

## స్పోర్ట్స్

# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే జడేజా!



ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్ రౌండర్స్ జాబితాలో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఏకంగా 400 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అయితే బంగ్లాదేశ్ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో బుధవారం తాజా ర్యాంకింగ్స్‌ను పొందుపర్చారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో మిరాజ్ 116 పరుగులు రాబట్టడమేగాక, 15 వికెట్లు తీశాడు. దాంతో ఆల్‌రౌండర్స్ జాబితాలో అతను ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. అంతేగాక రెండో టెస్టులో సెంచరీ ద్వారా మిరాజ్.. ఐసీసీ బ్యాటర్స్ జాబితాలో కూడా 8 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్ జోయ్ రూట్ ఈసారి కూడా టాప్-20లో చోటు దక్కించుకోలేకపోయారు. అయితే జింబాబ్వే లెఫ్ట్ హ్యాండర్ సీన్ విలియమ్స్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 19వ స్థానానికి చేరుకున్నాడు. అదే సమయంలో బంగ్లాదేశ్‌కు చెందిన షద్మాన్ ఇస్లామ్ ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకుని 60వ స్థానానికి దూసుకెళ్లాడు. మిరాజ్ టెస్టు బౌలర్స్ విభాగంలో కూడా రెండు స్థానాలు మెరుపర్చుకుని 24వ స్థానానికి వెళ్లాడు.